క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొల్లాపూర్: కొల్లాపూర్ పట్టణంలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏఈ ప్రదీప్‌గౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చెట్ల కొమ్మల తొలగింపు, విద్యుత్ తీగల మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని తెలిపారు.

వివాహిత అదృశ్యం: కేసు నమోదు

నాగర్‌కర్నూల్ క్రైం: వివాహిత అదృశ్యం కావడంతో కేసు నమోదైన సంఘటన శనివారం చోటుచేసుకుంది. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రానికి చెందిన వివాహిత స్వాతి ఈనెల 7న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె భర్త స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వాహన సంబంధిత పత్రాలు తప్పని సరి



చారకొండ: వాహనదారులతో సంబంధిత పత్రాలను తప్పని సరిగా ఉండాలని ఎస్ఐ శంషోద్దీన్ అన్నారు. మండల కేంద్రంలో జడ్చర్ల- కోదాడ జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనాల సంబంధిత పత్రాలను తనిఖీ చేశారు. రోడ్డు నిబంధనలు తప్పని సరిగా పాటించాలన్నారు. ద్విచక్రవాహన దారులకు హెల్మెట్ తప్పనిసరి అని, మద్యం తాగి వాహనాలు నడుపరాదని, మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని సూచించారు. ఎస్ఐతో పాటు పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టుకున్న గ్రామస్తులు



తాడూరు: మండలంలోని గోవిందాయిపల్లిలో ఎలాంటి అనుమతి లేకుండా దుందుభీ వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను శనివారం గోవిందాయిపల్లి గ్రామస్తులు పట్టుకున్నారు. మండలంలోని ఎట్టిదార్‌పల్లి గ్రామానికి చెందిన శేఖర్‌గౌడ్ వారంరోజుల నుంచి ఇసుక తరలిస్తుండడంతో గ్రామస్తులు కాపుకాసి పట్టుకున్నారు. ఈ విషయమై సదరు వ్యక్తిని ప్రశ్నిస్తే బిరుసుగా సమాధానాలు ఇస్తున్నట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ విషయమై జిల్లా స్థాయి అధికారులుకు ఫిర్యాదు చేస్తామని గ్రామస్తులు తెలిపారు.

10న మహాధర్నాను జయప్రదం చేయాలి

ఉప్పునుంతల: పేద ప్రజల సంక్షేమాన్ని విస్మరిస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ ఈనెల 10న చేపట్టే మహాధర్నాను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎల్ దేశ్యానాయక్ అన్నారు. శనివారం మండలంలోని రాయిచెడ్‌లో సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక, సీపీఎం ఆధ్వర్యంలో ఈ ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు నాగరాజు, మల్లేష్ పాల్గొన్నారు.

కోటగోడ తవ్వకంపై ఫిర్యాదు

బిజినేపల్లి: కాకతీయుల కాలంలో నిర్మించిన కోటగోడ మట్టి తవ్వకంపై మండలంలోని నందివడ్డెమాన్ గ్రామానికి చెందిన పంచాయతీ కార్యదర్శి లింగారెడ్డి శనివారం తహసీల్దార్ శ్రీరాములుకు, ఎంపీడీఓ కతలప్పకు, ఎస్ఐ శ్రీనివాసులుకు ఫిర్యాదు చేశాడు. కోటగోడ మట్టిని కొందరు వ్యక్తులు అక్రమంగా తమ అవసరాల కోసం తవ్వుతున్నారని పేర్కొన్నాడు. కోటగోడ మట్టి తవ్వకాలకు ఇప్పటి వరకు ఎలాంటి అనుమతులు లేవని తెలిపారు. రెండు రోజుల కిందట మట్టి తవ్వకాలు చేపట్టిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

మహిళకు వేధింపులు

నాగర్‌కర్నూల్ క్రైం: ఇన్‌స్టాగ్రాంలో ఓ వ్యక్తి మహిళను వేధింపులకు గురి చేసిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్ర కారం.. బిజినేపల్లి మండలానికి చెందిన మహిళతో ఓ వ్యక్తి అమ్మాయిఫొటోతో చాటింగ్ చేస్తూ పరిచయం పెంచుకున్నాడు. సదరు మహిళ అమ్మాయి ఫొటోతో చాటింగ్ చేస్తున్న వ్యక్తికి తన ఫొటోను పంపడంతో ఆ వ్యక్తి మహిళ ఫొటోతో ఇన్‌స్టాగ్రాంలో ఫేక్ అకౌంట్ ఓపెన్ చేసి ఇబ్బందులకు గురిచేశాడు. దీంతో ఆ మహిళ శనివారం షీ టీంను ఆశ్రయించింది. మహిళను వేధింపులకు గురి చేస్తున్న వ్యక్తి పూర్తి వివరాలు సేకరిస్తున్నట్లు షీ టీం ఏఎస్సై విజయలక్ష్మి తెలిపారు.

శిశు సంజీవనిని వినియోగించుకోండి

- జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ కేవీ స్వరాజలక్ష్మి



అచ్చంపేట ప్రాంతీయ ఆస్పత్రిలో శిశు సంజీవని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ స్వరాజ్యలక్ష్మి

అచ్చంపేట: జిల్లాలో శిశు సంజీవని(ఎస్ఎన్‌సీయూ) సేవలు వినియోగించుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కేవీ స్వరాజలక్ష్మి అన్నారు. శనివారం అచ్చంపేట ప్రాంతీయ ఆస్పత్రిలోని ఎస్ఎన్‌సీయూ శిశు సంజీవని కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిశు సంజీవనిలో అడ్మిట్ అయిన చిన్నారుల ఆరోగ్యంపై చిన్నపిల్లల వైద్య నిపుణులను అడిగి తెలుసుకున్నారు. తల్లిపాల ప్రాముఖ్యత, వెచ్చదనం, కంగారు వంటి మదర కేర్ గురించి ఆస్పత్రిలో చేరిన చిన్నారుల తల్లులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆరోగ్య ఉప కేంద్రంలో టీకాకరణ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. టీకాలు ఇస్తున్న చిన్నారులు, గర్భవతుల జాబితాను, వ్యాక్సిలను పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ తారాసింగ్, డీపీఓ రేణయ్య, డివిజన్ మలేరియా అధికారి బిక్కులాల్, పర్యవేక్షకుడు హనమంతు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నులి పురుగులను నిర్మూలిద్దాం



శిక్షణలో మాట్లాడుతున్న వైద్యాధికారులు

కందనూలు: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఎంఆర్‌సీ భవన్‌లో శనివారం పెద్దముద్దునూరు ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి డా.వాణి ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డా. వాణి మాట్లాడుతూ 1–19 సంవత్సరాల పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేసి నులి పురుగులను నిర్మూలించాలన్నారు. నులిపురుగుల సంక్రమణ వల్ల పిల్లల్లో పోషకాహార లోపం, రక్తహీనత, తరుచుగా వ్యాధుల బారిన పడటం, కడుపునొప్పి, తదితర సమస్యలు, విద్యార్థులు చురుకుగా ఉండకపోవడం, ఆటలాడకపోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి భాస్కర్‌రెడ్డి, కాంప్లెక్స్ హెడ్మాస్టర్ కురుమయ్య, వివిధ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రథోత్సవానికి ముస్తాబైన తేరు



పెద్దకొత్తపల్లి: దేవల్‌తిర్మలాపూర్‌లోని శ్రీదేవి-భూదేవి వేంకటేశ్వర స్వామి రథోత్సవం కోసం ఆలయ సిబ్బంది తేరును ముస్తాబు చేశారు. ఈ నెల 11న శ్రీదేవి, భూదేవి వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం, 12న రాత్రి రథోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ పూజారి శేషాచార్యులు తెలిపారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ



వెల్దండ మండలం గాన్‌గట్టుతండాలో సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

వెల్దండ: మండలంలోని గాన్‌గట్టుతండా, కంటోనిపల్లి గ్రామాల్లో శనివారం జాతీయ ఉపాధి హామీ పథకం పనులపై గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ ఉపాధి హామీ పథకంలో చేసిన పనులపై సామాజిక తనిఖీ బృందం పర్యవేక్షించి నిధుల అక్రమాలను గుర్తిస్తున్నారు. గాన్‌గట్టు తండాలో రూ.8.13లక్షలు, కంటోనిపల్లిలో రూ.8.90 లక్షలపై సామాజిక తనిఖీ నిర్వహించారు. గ్రామసభల్లో కూలీలతో మాట్లాడారు. చేసిన పనులు, నిధుల దుర్వినియోగంపై అధికారులు, కూలీలతో చర్చించారు. 14న మండల గ్రామ సభను నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ ఈశ్వర్‌జీ, టీఏలు సత్యనారాయణ, శివలీల, ఉస్సేన్, కార్యదర్శి మాధవి, ఫైయాజ్, ఎస్ఆర్‌పీ బద్రునాయక్, డీఆర్‌పీలు శంకర్, శిరీష, ఫీల్డ్‌అసిస్టెంట్ కృష్ణయ్య ఉన్నారు.

నేడు గ్రామ సభలు..

మండలంలోని ఆయా గ్రామాల్లో ఆదివారం గ్రామ సభలను నిర్వహిస్తున్నట్లు ఏపీఓ ఈశ్వర్‌జీ తెలిపారు. పెద్దాపూర్, బండోనిపల్లి, పోషమ్మగడ్డతండా, సిలోనిబావితండా, బండోనిపల్లి, చౌదర్‌పల్లి, కొట్ర, నారాయణపూర్, కుప్పగండ్ల, మర్రిగుంత తండా, చెదురుపల్లి, పోతేపల్లి గ్రామాల్లో గ్రామసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సింగిల్‌విండోలో బీసీ రిజర్వేషన్ అమలు చేయాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: స్థానిక ఎన్నికలతో పాటు సింగిల్‌విండో ఎన్నికల్లోను రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని బీసీ పొలిటికల్ జిల్లా నాయకులు అరవిందచారి, కుంభం మల్లేష్‌గౌడ్, కాళ్ల నిరంజన్, రవీందర్‌గౌడ్‌లు శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సింగిల్‌విండో ఎన్నికల్లో డైరెక్టర్లకు రిజర్వేషన్లు కల్పించిన గత ప్రభుత్వాలు సొసైటీ అధ్యక్షులకు, డీసీసీబీ చైర్మన్ పదవులకు మాత్రం రిజర్వేషన్లు కల్పించడంలేదని ఆరోపించారు. స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లను బీసీలకు కల్పిస్తామని ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి



కొల్లాపూర్: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తారాసింగ్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన కొల్లాపూర్‌లో ఎస్ఎఫ్ఐ మండల నాయకులతో సమావేశమయ్యారు. పలు అంశాలపై చర్చించారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల విడుదల కోసం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పోరాట చేస్తామన్నారు. సమావేశం అనంతరం మండల ఎస్ఎఫ్ఐ నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా అంజి, కార్యదర్శిగా కార్తీక్, ఉపాధ్యక్షులుగా నందిని, భాస్కర్, మోహన్, గణేష్, సహాయ కార్యదర్శులుగా మహేష్, శివతో పాటు 16మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

ఢిల్లీలో విజయంపై బీజేపీ సంబరాలు



నాగర్‌కర్నూల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

సాక్షి, నెట్‌వర్క్: ఢిల్లీలో బీజేపీ విజయం సాధించడంతో జిల్లాలోని బీజేపీ శ్రేణులు బాణాసంచా కాల్చి, మిఠాయిలు పంచి సంబరాలు నిర్వహించారు. నాగర్‌కర్నూల్ పట్టణంలో ప్రధాన రహదారిపై కార్యకర్తలు డప్పులతో, బాణాసంచా పేల్చి ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బుసిరెడ్డి సుధాకర్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఒల్డాస్ రాము, టౌన్ ప్రెసిడెంట్ రాము, టౌన్ జనరల్ సెక్రటరీ ప్రమోద్ కుమార్ మాట్లాడారు.

బీజేపీ గెలుపును ఎవరూ ఆపలేరు


- దేశంలో బీజేపీ గెలుపును ఎవరూ ఆపలేరని బీజేపీ రాష్ట్ర నాయకుడు, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి అన్నారు. కల్వకుర్తి పట్టణంలోని పాలమూరు చౌరస్తాలో ఢిల్లీలో బీజేపీ విజయంపై టపాసులు కాల్చి, మిఠాయిలు పంచారు.
- అచ్చంపేటలో బీజేపీ నాయకులు అంబేడ్కర్ చౌరస్తాలో బాణా సంచా కాల్చి, స్వీట్లు పంచారు.
- తిమ్మాజిపేటలో అంబేడ్కర్ విగ్రహం వద్ద బాణాసంచా పేల్చి, స్వీట్లు పంచుకున్నారు.
- బిజినేపల్లి మండల కేంద్రంలోని ప్రధాన కూడలి వద్ద బాణాసంచా కాల్చారు.
- ఢిల్లీలో బీజేపీ గెలుపుపై ఆ పార్టీ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షులు ఎల్లేని సుధాకర్‌రావు హర్షం వ్యక్తం చేశారు. కొల్లాపూర్, నాగర్‌కర్నూల్ జిల్లాలో బీజేపీని బలోపేతం చేస్తామని పేర్కొన్నారు.
- లింగాల మండల కేంద్రంలో బీజేపీ శ్రేణులు ర్యాలీ నిర్వహించి బాణా సంచా పేల్చి, స్వీట్లను పంచుకున్నారు.
- అమ్రాబాద్ మండలంలోని అంబేడ్కర్ చౌరస్తాలో బాణా సంచా కాల్చి స్వీట్లు పంచుకున్నారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగిశెట్టి నాగరాజు మాట్లాడారు.
- తాడూరు మండల కేంద్రంలో బస్టాండ్ దగ్గర బాణాసంచా పేల్చి సంబరాలు నిర్వహించారు.
- పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలో బాణా సంచా కాల్చి, మిఠాయిలు పంచారు.
- వెల్దండలో బీజేపీ కార్యకర్తలు బాణా సంచా కాల్చి, స్వీట్లను పార్టీ కార్యకర్తలు పంచుకున్నారు.
- చారకొండలో జడ్చర్ల–కోదాడ జాతీయ రహదారిపై బీజేపీ శేణులు బాణాసంచా కాల్చారు.

'మిజోరం' అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చంద్రశేఖర్‌రెడ్డి



పెద్దకొత్తపల్లి: పెద్దకొత్తపల్లి మండల కేంద్రానికి చెందిన డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి మిజోరం సెంట్రల్ విశ్వవిద్యాలయంలో సోషియాలజీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా శనివారం విధుల్లో చేరారు. పెద్దకొత్తపల్లి గ్రామానికి చెందిన యాదగిరిరెడ్డి, మంజుల దంపతుల కుమారుడు డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి మండల కేంద్రంలోనే 1వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ పూర్తి చేశారు. హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో సోషియాలజీలో డిగ్రీ, పీజీ, ఎంఫిల్, పీహెచ్‌డీ పూర్తి చేసిన ఆయన అనంతరం గీతం విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేశారు. ప్రస్తుతం మిజోరం సెంట్రల్ విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధుల్లో చేరారు. ఉన్నత శిఖరాలకు ఎదిగిన చంద్రశేఖర్ రెడ్డిని మిత్ర బృందం లింగస్వామి, కృష్ణారెడ్డి, భాస్కర్ రెడ్డి, గ్రామస్తులు అభినందించారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



గౌరెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, అధికారులతో ఉపాధ్యాయులు

తెలకపల్లి: విద్యార్థులే ఉపాధ్యాయులై విద్యార్థులకు విద్యా బోధన చేశారు. మండలంలోని గౌరెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుధాకర్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులైన విద్యార్థులు పాల్గొన్నారు.

- తాడూరు మండలంలోని ఐతోలు ఉన్నత పాఠశాలలో విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రమేష్ కుమార్, బ్రహ్మయ్య, శైలజ, కిరణ్ కుమార్, శ్రీశైలం పాల్గొన్నారు.
- దోమలపెంటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. ప్రతిభ చాటిన ఛాత్రోపాధ్యాయులకు ప్రథమ, ద్వితీయ బహుమతులను హెచ్‌ఎం.నాగయ్య అందించారు. ఏఏపీసీ చైర్‌పర్సన్ లక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బస్సుకోసం ప్రయాణికుల ఇబ్బందులు

తెలకపల్లి: బస్సు రాకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తెలకపల్లి నుంచి కల్వకుర్తి వెళ్లే ఆర్టీసీ బస్సు సమయానికి రాక ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడినట్లు ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేశారు. కల్వకుర్తి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులు తెలకపల్లి–కలకుర్తి, మరికొన్ని లింగాల – కల్వకుర్తి సెటిల్ తిరుగుతుంటాయి. శనివారం సాయంత్రం బస్సులు లేకపోవడం వల్ల తెలకపల్లి నుంచి కల్వకుర్తి తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు తెలకపల్లి బస్టాండ్‌లో పడిగాపులు కాశారు. 7:30గంటల తరువాత బస్సు రావడంతో బస్సు ఎక్కారు. 2 గంటల పాటు బస్సులు లేక తీవ్ర ఇబ్బంది పడినట్లు ఆవేదన వ్యక్తం చేశారు.

విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ప్రారంభం



రాజాపూర్‌లో ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు



పెంట్లవెల్లిలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కోడేరు: మండలంలోని రాజాపూర్‌లో శ్రీసీతారామాంజనేయ స్వామి ఆలయంలో మూడు రోజుల పాటు జరిగే విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఉదయం మహాగణపతి పూజ, పుణ్యాహవచనం, పంచాగ్రవణం, రక్షకబంధనం, వాస్తు మండపం, సర్వతోభద్ర మండల ఆరాధన, ప్రతిష్ఠాపన, ధాన్యదివానం, మహామంగళహారతి పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పూజారులు శరత్‌చంద్రశర్మ, పవన్ కుమార్, శ్రావణ్‌కుమార్, సంతోష్, భరత్‌ద్వాజ్, తదితరులు పాల్గొన్నారు.

పెంట్లవెల్లిలో గంగమ్మ ఉత్సవాలు

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో నూతన గంగమ్మ ఆలయ నిర్మాణంలో భాగంగా మహాగణపతి ప్రతిష్ఠ సందర్భంగా గణపతి పూజ, హోమం, ఆవాహిత సర్వదేవత మండపారాదన, జలదివాసం, మంగళహారతి నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. పలువురు జంటలు ఘనంగా హోమం నిర్వహించారు. 10న నవగ్రహ, గంగమ్మ విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజ స్తంభ కార్యక్రమం నిర్వహించనున్నట్లు అర్చకులు శివయ్యశర్మ తెలిపారు. కార్యక్రమంలో కుమార్, రేణు, లక్ష్మీనారాయణ, ఇంద్ర, గంగన్న, రామకృష్ణ, నరేష్ పాల్గొన్నారు.

విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలి



జేసీ దేవసహాయానికి వినతిపత్రం ఇస్తున్న జక్కా రామస్వామి

కందనూలు: రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు విద్యారంగాన్ని అభివృద్ధి చేస్తామని, అధికారంలోకి వచ్చిన తర్వాత బడ్జెట్‌లో విద్యారంగానికి 7 శాతం మాత్రమే నిధులు కేటాయించడంతో తెలంగాణ విద్యా పరిరక్షణ ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ ముందు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ కన్వీనర్ జక్కా రామస్వామి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఫిబ్రవరిలో ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌లో విద్యారంగానికి 20 శాతం నిధులు కేటాయించాలని, ఆ నిధులు విద్యారంగానికి మాత్రమే ఖర్చు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం జాయింట్ కలెక్టర్ దేవసహాయానికి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కే.లక్ష్మణ్, జిల్లా బాధ్యులు డి. తిరుపతయ్య నాయక్, తదితరులు పాల్గొన్నారు.

రామాలయంలో భీష్మ ఏకాదశి పూజలు



లింగాల రామాలయంలో ప్రత్యేక పూజలో పాల్గొన్న వికాస తరంగిణి సభ్యులు

లింగాల: మండల కేంద్రంలోని శ్రీ కోదండరామాలయంలో భీష్మ ఏకాదశిని పురస్కరించుకొని శనివారం ఆలయ ప్రధాన అర్చకులు రామాచారి, సుదర్శనాచారి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భీష్మ ఏకాదశి ప్రత్యేకతను ఆలయ అర్చకులు భక్తులకు వివరించారు. ఈ సందర్భంగా వికాస తరంగిణి మహిళా భక్తులు ఆలయంలో వేకువజామున సుప్రభాతం, అర్చనలు నిర్వహించారు. విష్ణు సహస్ర పారాయణం, గోవింద నామార్చనలు చేశారు. అనంతరం తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. కార్యక్రమంలో వికాస తరంగిణి కార్యకర్తలు పాపిశెట్టి అశోక్‌శెట్టి, మహిళలు పాల్గొన్నారు.

సృజనాత్మక ఆలోచనలు పెంచుకోవాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రవి

బల్మూర్: విద్యార్థులు సృజనాత్మక ఆలోచనలు పెంపొందించుకోవాలని ప్రిన్సిపాల్ పరంగి రవి సూచించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 'యూత్ ఫర్ సోషల్ ఇంపాక్ట్' కార్యక్రమాన్ని మండలంలోని కొండనాగుల శ్రీ ఉమామహేశ్వరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల మంచి ఆలోచనలు నూతన ఆవిష్కరణలకు తోడ్పడతాయని, వ్యాపార దృక్పథం ఉన్న ఆలోచనలు మనకు ఆదాయన్ని సమకూరుస్తాయన్నారు. ఈ యూత్ ఫర్ సోషల్ ఇంపాక్ట్ అనే కార్యక్రమాన్ని భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో వైఎఫ్ ఎస్ఐ కోఆర్డినేటర్ ముంతాజ్ బేగం, అధ్యాపకులు డాక్టర్ డూప్సింగ్, బి జాస్ బాబు, ఈశ్వర్‌లాల్, డాక్టర్ బాల్‌రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెంచు కుటుంబానికి సరుకుల వితరణ



ఎర్రపెంటలో చెంచు కుటుంబానికి నిత్యావసర సరకులను అందిస్తున్న ఎమ్మార్వై

లింగాల: మండలంలోని నల్లమల అటవీ ప్రాంతం ఎర్రపెంటకు చెందిన నిమ్మల లక్ష్మమ్మ కుటుంబానికి శనివారం మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సీతారాంనాయక్ నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. 5 నెలల క్రితం భర్త నిమ్మల శంకర్ అటవీ ఉత్పత్తుల సేకరణకు అడవికి వెళ్లి నేటికీ ఆచూకీ లభ్యం కాలేదు. అండగా ఉన్న లక్ష్మమ్మ అత్త కూడా ఇటీవల మరణించింది. దీంతో చెంచు మహిళలు తన 5 మంది పిల్లలతో అర్ధాకలితో జీవనం సాగిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మార్వై పెంటకు వెళ్లి బియ్యం, ఇతర సరుకులను అందజేసి తన ఉదార స్వభావాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో చెంచు నాయకుడు సన్నయ్య పాల్గొన్నారు.

డ్రైయినేజీ లేకపోవడంతో దుర్వాసన



గురుకుల పాఠశాల వద్ద మురుగును చూపుతున్న తల్లిదండ్రులు

వెల్దండ: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలకు డ్రైయినేజీ లేకపోవడంతో పాఠశాల ఆవరణలో దుర్వాసన వస్తోందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం విద్యార్థులను చూసేందుకు వచ్చిన తల్లిదండ్రులు దుర్వాసన చూసి ఆందోళన చేశారు. పందులు సంచరిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం పాఠశాలల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో పిల్లలు అనారోగ్యాలకు గురవుతున్నట్లు వారు పేర్కొన్నారు. ఉన్నత అధికారులు స్పందించి డ్రైయినేజీ సమస్యను పరిష్కరించాలన్నారు. అనంతరం తల్లిదండ్రులు తహసీల్దార్ కార్తీక్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి డ్రైయినేజీ సమస్య తీర్చేందుకు కృషి చేయాలని తల్లిదండ్రులు తహసీల్దార్‌ను కోరారు.

నూతన పద్ధతులతో బోధన చేయాలి



వెల్దండలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంఈఓ చంద్రుడు

వెల్దండ: పాఠ్యాంశాలు విద్యార్థులకు అర్థమయ్యే విధంగా నూతన పద్ధతులతో బోధన చేయాలని ఇన్‌చార్జి ఎంఈఓ చంద్రుడు పేర్కొన్నారు. శనివారం వెల్దండలోని ఎమ్మార్సీ కార్యాలయంలో వెల్దండ, వంగూర్, చారకొండ మండలాలకు చెందిన గణితశాస్త్రంపై కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షకులు మాట్లాడుతూ గణితం విద్యార్థులకు సులభతరం బోధన అంశాలను వివరించారు. 10వ తరగతిలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించేలా మేలుకువలు వివరించాలన్నారు. యుడైస్ ప్లేస్ నమోదు, ఎఫ్ఎల్ఎన్ నమోదు, లిప్ నమోదు, ఆన్‌లైన్ విద్యార్థుల ప్రగతి, అపార్ ఐడీ నమోదు, అమ్మ ఆదర్శ పాఠశాల పనులు, తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో రవీందర్, ఏఈ లక్ష్మీపతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.